# తెలుగు పండుగలు



సుధామ

# తెలుగు పండుగలు

రచన

**సుధామ**

ప్రచురణ

**శ్రీ మానస పబ్లికేషన్స్**

శ్రీపతి సూర్యనారాయణ వీధి

గవర్నరుపేట::విజయవాడ - 520 002.

# తెలుగు పండుగలు


**సుధామ**



**శ్రీ మానస ప్రచురణ**

ప్రథమ ముద్రణ

- 2002

వెల: రు. **15**-00

ముద్రణ :
**స్వామి ఆఫ్‌సెట్ ప్రింటర్స్**
విజయవాడ - 520 003.
ఫోన్స్ : 578211, 572832

లోపలి బొమ్మలు

ముఖ చిత్రం

**కాశీ**



All Rights including subject matter and Title Style are reserved with the Publishers.

# తెలుగు పండుగలు


పండుగ అంటే ఆనందం. పండుగ అంటే వేడుక. ప్రతి పండుగా ఒక సందేశం ఇస్తుంది. ఎక్కడ నివసించే వారయినా పండుగలు చేసుకుంటారు. ఏ భాష వారయినా, ఏ కులంవారయినా పండుగలు చేసుకుంటారు. పండుగలు అందరికీ సంబంధించినవి.

గొప్పవారి పుట్టిన రోజులు పండుగలు. అలాగే దుర్మార్గులు మరణించి ధర్మము, న్యాయము గెలుచుట పండుగే. పండుగలు అందరూ పాటించి ఆనందిస్తారు. ఐక్యతకు, అంతా ఒక్కటే' అనే భావనకు పండుగ గుర్తు.

తెలుగువారి పండుగలలో మొదటిది ఉగాది. దీనినే సంవత్సరాది అంటాము. ఇంగ్లీషు నెలల ప్రకారము తెలుగు వారి ఉగాది మార్చి లేదా ఏప్రిల్ మొదట్లో వస్తుంది. సూర్యుడు, చంద్రుడు లేదా బృహస్పతిల నడకను బట్టి కాలము లెక్కించబడుతుంది. చైత్ర మాసములో శుద్ధపాడ్యమి నుండి సంవత్సరాది అంటే ఉగాదిగా లెక్కిస్తారు. ఆరోజే

సూర్యుడు భూమధ్యరేఖపై ఉదయిస్తాడని అంటారు. తెలుగు సంవత్సరం నెలలు-పన్నెండు. అవి: చైత్రము - వైశాఖము - జ్యేష్ఠము - ఆషాఢము - శ్రావణము - భాద్రపదము - ఆశ్వయుజము - కార్తీకము - మార్గశిరము - పుష్యము - మాఘము - ఫాల్గుణము. ప్రతినెలకూ శుక్లపక్షము - కృష్ణపక్షము అని రెండు పక్షములు. పక్షము అనగా పదిహేను రోజులు. రోజు రోజు తిథి మారుతూ ఉంటుంది. పక్షము పాడ్యమితో మొదలై విదియ - తదియ - చవితి - పంచమి - షష్ఠి - సప్తమి - అష్టమి - నవమి - దశమి - ఏకాదశి - ద్వాదశి - త్రయోదశి - చతుర్దశి గా సాగుతుంది. శుక్లపక్షము పూర్ణిమతో ముగుస్తుంది. కృష్ణపక్షము అమావాస్యతో ముగుస్తుంది.

ఉగాదిగా చెప్పుకునే తెలుగు సంవత్సరం ఏడాదికి ఒక పేరు కలిగి ఉంటుంది. అరవై సంవత్సరాలూ పూర్తి అయ్యాక మళ్లీ మొదటి నుండీ సంవత్సరాలు లెక్కించబడతాయి.



## ఉగాది

ఉగాదినాడు తలంటు స్నానము చేసి కొత్త బట్టలు తొడుగుకుంటారు. దేవునికి నివేదించి ఉగాది పచ్చడి తింటారు. వేపపువ్వు, మామిడి ముక్కలు, బెల్లము, చింతపండు, పచ్చిమిరప ముక్కలు, చెఱకు ముక్కలు, కొబ్బరి, తేనె, ఉప్పు, గసగసాలు, నెయ్యి మొదలయిన వాటిలోంచి - ఆరు ముఖ్యమైన రుచుల

కలయికగా ఉగాదిపచ్చడి తయారు చేస్తారు. కొందరు ఈ పచ్చడిని 'గొజ్జు' అంటారు.

ఉగాదినాడు తిథి, వారము, నక్షత్రము, యోగము, కరణము అను అయిదింటితో కూడిన పంచాగము'ను విని, రానున్న సంవత్సరములో తమ గ్రహస్థితి ఎలా వున్నదో తెలుసుకుంటారు. తాము తీసుకోవలసిన జాగ్రత్తలను తెలుసుకుంటారు. తెలుగువారు ఉగాదిని చంద్రమానమును (అనగా చంద్రుడి నడకను) అనుసరించి పాటిస్తారు.

## శ్రీ రామనవమి

ఉగాది తరువాత కొద్దిరోజులకే వచ్చే పండుగ శ్రీరామనవమి. చైత్ర శుద్ధ నవమి రోజు పాటించే పండుగ. మానవుడు ధర్మమును అనుసరించాలి. మంచిప్రవర్తన కలిగివుండాలి. ప్రజల మనసుకు





ఆనందం కలిగించాలి. అటువంటి వాడే అందరికీ ఆరాధ్యుడు అవుతాడు. శ్రీరాముడు దైవముగాకాక మానవునిగా అలా ఆరాధ్య పురుషుడు అయ్యాడు.

శ్రీరామనవమి పండుగ సీతారాముల కల్యాణ ఉత్సవం. శ్రీరామనవమి తొమ్మిది రోజులు పండుగగా చేసే ఆచారం వుంది. పందిళ్లు వేసి పురాణకాలక్షేపం, హరికథలు, వినోద కార్యక్రమములు నిర్వహించడం కనిపిస్తుంది. 'రామరాజ్యము' అనే మాట ప్రజల సుఖజీవనమునకు, ఉత్తమ పాలనకు గుర్తుగా చెబుతారు.

# కృష్ణాష్టమి

కృష్ణుని జన్మదినం కృష్ణాష్టమి. శ్రావణ మాసంలో బహుళ అష్టమిని గోకులాష్టమి అని కూడా అంటారు. కృష్ణుని బాల్యం అంతా అద్భుతాలతో కూడినది. అందుకే అతనిని 'లీలా బాలుడు' అని కూడా అంటారు. కృష్ణాష్టమి వేడుకలలో 'ఉట్టి కొట్టడం' అనేది



ఒక విశేషమైన క్రీడ. భాగవత కృష్ణుడు భారత కృష్ణునిగా ఎదిగి 'భగవద్గీత' ను ఉపదేశించాడు.

## రాఖీపౌర్ణమి

రాఖీపౌర్ణమి శ్రావణ మాసంలో వస్తుంది. సోదరీ సోదరుల అనుబంధానికి గుర్తుగా ఇది ఎక్కువగా పాటించబడుతుంది. ఉత్తరాది వారు దీనిని ఆవిధం గానే పాటిస్తారు. ఆడపిల్లలు తమ అన్న దమ్ముల ఇళ్లకు



వెళ్లి చేతికి రక్షకట్టి ఆశీర్వాదము పొందుతారు. పురుషోత్తముని భార్య అలెగ్జాండర్ చక్రవర్తికి రాఖీ కట్టిందని చరిత్రలో చెప్పబడింది.


## వినాయకచవితి

భాద్రపద శుద్ధ చవితి వినాయకచవితి పండుగ. సాధారణంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలలలో వచ్చే పండుగ ఇది. వినాయకుడు గణాధిపతిగా పూజింప

బడతాడు. అతడు శివపార్వతుల కుమారుడు. ఏ కొత్తపనిని ప్రారంభించడానికయినా ముందుగా వినాయకుడిని అనగా గణపతిని పూజించుట ఆచారము.

పార్వతీదేవి నలుగుతో బొమ్మను చేసి ప్రాణము పోయగా గణపతి జన్మించాడు అంటారు. ఆమె స్నానమునకు వెడుతూ, కావలిగా అతనిని ఉంచింది. లోనికి పోబోతున్న శివుని అతను అడ్డగించగా కోపముతో శివుడు ఆ బాలుని తలనరికాడు. ఆ తరువాత పార్వతి ద్వారా విషయము గ్రహించి - ఉత్తర దిక్కుగా తలపెట్టి నిద్రపోతున్న ఓ ఏనుగు తలను తెచ్చి అతికించి ప్రాణంపోసాడు. అందుకే అతనికి గజముఖుడు, గజాననుడు అని పేరు వచ్చింది. తిరిగి బ్రతికిన గణపతి కడుపునిండా తిని, తనకు గణాధిపత్యాన్ని ఇచ్చిన తల్లి తండ్రులకు నమస్కారం చేయబోయాడు. కాళ్లు నేలకు ఆనిన తల ఆనక, తలనేలకు తగిలినా

కాళ్ళు ఆనక సాష్టాంగము కుదరలేదు. అది చూసి శివునితలపై చంద్రుడు నవ్వాడు. వినాయకుని పొట్ట



పగిలింది. పార్వతి కుమారుని అవస్థకు విచారించింది. తన కుమారుని చూసి నవ్విన చంద్రుని ముఖం చూసిన వారు అపనిందలు పొందుతారని శపించింది. అయితే తిరిగి ప్రసన్నం అయింది. తన శాపాన్ని కేవలం వినాయక చవితి రోజుకే పరిమితం చేసింది పార్వతి.

రకరకాల రూపాలలో వినాయకుని ప్రతిమలను చేసి పూజించుట, గణేశ నిమజ్జనం వైభవంగా చేయుట నేటికీ వుంది.

## విజయదశమి (దసరా)

ఆశ్వయుజ శుద్ధ దశమి విజయదశమి పండుగ. దీనినే దసరాపండుగ అంటారు. సాధారణముగా అక్టోబర్ నెలలో ఈ పండుగ వస్తుంది. రామాయణం లోనూ, భారతంలోనూ, దేవీభాగవతంలోనూ దసరాకు సంబంధించి కథలున్నాయి.

రాముడు రావణవధ చేసిన దినమే 'విజయ దశమి' అని ఒక కథ. దసరానాడు బొమ్మల కొలువు పెట్టి సీతారాములు, హనుమంతుడు మొదలగువారి బొమ్మలువుంచుట ఆనవాయితీ. అంటే అలవాటు.

మాయాజూదంలో అడవులపాలయిన పాండవులు పన్నెండేళ్లు అరణ్యావాసము, ఒక ఏడాది అజ్ఞాత వాసము చేసారు.

ఉత్తరగోగ్రహణము ద్వారా పాండవుల అజ్ఞాత వాసము కౌరవులు భంగము చేయాలను కుంటారు. విరాటుని కొలువులో వున్న పాండవుల అజ్ఞాతవాసము ముగిసింది. బృహన్నలగా వున్న అర్జునుడు శమీ వృక్షంపై దాచిన తమ ఆయుధాలను తీసుకుని కౌరవులతో యుద్ధంచేసి విజయం పొందాడు. ఆరోజే విజయదశమి. ఇది భారతం చెప్పే కథ

మహిషాసురుడు అనే రాక్షసుని ఆగడాలు మితిమీరాయి. దేవతలూ, త్రిమూర్తులూ అతనిని



చంపలేకపోయారు. అప్పుడు 'స్త్రీ అబల కాదు సబల' అని నిరూపిస్తూ శక్తి రూపిణి అయిన పార్వతి వానిని పరివారంతో సహా సంహరించింది. ఆదిశక్తి - కాళి,

దుర్గ, భ్రామరి, రక్తదంతి, మాతంగి, శాకంబరి, నందిని, లక్ష్మి, సరస్వతి అనే తొమ్మిది రూపాలు ధరించి శత్రుసంహారంచేసింది. అందుకే 'నవదుర్గ' గా పూజింప బడింది. పదవరోజు దశమి పండుగరోజు. పాడ్యమి నుండి దశమి వరకు అమ్మవారి గుడులలో జరిగే 'దశహరా' ఉత్సవములే దసరావేడుకలు. మైసూరులో ఆ వేడుకలు ఒక విశిష్టత గలవి. పిల్లలు విల్లంబులు ధరించి ఆడుతారు. గురు శిష్య సంబంధముగా కూడా దసరా పండుగ పాటిస్తారు. పులివేషములువేయుట, బొమ్మలకొలువలు వంటి వేడుకలు ఘనంగాచేస్తారు.

## దీపావళి

పండుగలలో దీపావళి పండుగకు ఒక ప్రత్యేకత వుంధి. అమావాస్యనాడు వచ్చే వెలుగుల పండుగ దీపావళి. శ్రీకృష్ణుని అవతార ప్రయోజనాలలో నరకాసుర వధ' ఒకటి. సత్యభామ లోకకంటకుడు





అయిన నరకాసురుని జయించి అతనిని వధించిన రోజే దీపావళి. కృష్ణుడు సత్యభామా సమేతుడై నరకునిపై యుద్ధానికి వెళ్లాడు. మగువలు మగవారికి తీసిపోరని నిరూపించే సందర్భమే -నరకుని సంహారం స్వయ

ముగా సత్యభామ నిర్వహించడం. ఆశ్వీయుజ బహుళ చతుర్దశినాడు నరకాసుర వధ జరిగింది. ఆ మరుసటి రోజు అమావాస్యను ప్రజలు దీపాలు వెలిగించి బాణసంచాలు కాల్చి పున్నమిరేయిగా మార్చారు. నాటినుండి దీపావళి ఒక పెద్ద పండుగ అయింది.

మొదటిరోజు తలస్నానంచేసి, గడ్డితో చేసి బాణసంచా వుంచిన నరకాసురుని బొమ్మ కాలుస్తారు. సాయంత్రం దీపారాధన.

మరురోజు లక్ష్మీపూజ ప్రధానం. మర్రి, మామిడి, అత్తి, జువ్వి, నేరేడు అనే అయిదు చెట్ల బెరళ్లను నానబెట్టిన నీటితో దీపావళిరోజున తలస్నానం కొందరి ఆచారం. అమంగళ నివారణకై మతాబాల వంటి బాణసంచా కాలుస్తారు. దీపాల వరుసతో ఇళ్లు రాత్రిళ్లు కళ కళలాడుతాయి. దీపావళి అంటేనే దీపాల వరుస.

విక్రమార్కుడు సింహాసనమును అధిష్ఠించినదీ దీపావళినాడే. జైనమతమును స్థాపించిన మహావీరుడు సిద్ధిపొందిన రోజు కూడా దీపావళియేనట. అందుకే జైనమతస్తులయిన వారికి ఇది నూతన సంవత్సరంగా వేడుకలు చేసుకోవడం అలవాటు.

వర్షాకాలం వచ్చే క్రిములు దీపావళి బాణసంచా వదులు పొగ, గంధకము వలన నశిస్తాయి. దీపావళికి ఇలా వైజ్ఞానిక ప్రయోజనం కూడా వుందని చెప్పుకోవచ్చు.

## సంక్రాంతి

సంవత్సరములో ఉత్తరాయణ, దక్షిణాయనమని రెండు ఆయనములు. ఇవి ఆరునెలలకు ఒకటి వస్తాయి. సూర్యుడు కర్కాటకరాశిలో ప్రవేశించుట దక్షిణాయనము. మకరరాశిలో ప్రవేశించుట ఉత్తరాయణము. ఉత్తరాయణము పుణ్యకాలమని అంటారు.

ఇది దేవీదేవతలకు పగలు అనీ, దక్షిణాయణము రాత్రి అని విశ్వాసం.

ఆషాఢ మాసంలో ఏకాదశినాడు విష్ణుమూర్తి శేషతల్పము మీద నిద్రకు సిద్ధమవుతాడు. అది శయన ఏకాదశి లేక తొలిఏకాదశి. అది దక్షిణాయణమును సూచిస్తుంది. మార్గశిర మాసములో ఏకాదశినాడు విష్ణువు నిద్రనుండి లేస్తాడు. దానిని ఉత్థాన ఏకాదశి లేక వైకుంఠ ఏకాదశి అంటారు. ఉత్తరాయణ పుణ్య కాలమున వైకుంఠద్వారములు తెరుచుకొంటాయట. ముక్కోటి దేవతలూ మేలుకొంటారుట. కనుకనే అది ముక్కోటి ఏకాదశి అని కూడా అంటారు.

భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలము వరకూ అంపశయ్యపై నుండి ఉత్తరాయణము రాగానే ఏకాదశి నాడే స్వచ్ఛందముగా మరణించాడు అని భారతములో వుంది. భీష్మ ఏకాదశి అని కూడా అందుకే పిలుస్తారు.

మార్గశిర మాసములోనే సూర్యుడు బహుళ పాడ్యమిన ధనూరాశిలో ప్రవేశిస్తాడు. కనుకనే ధనుర్మాసము అని అంటారు. ధనుర్మాసము మొదలు సంక్రాంతి వరకూ ఇంటి ముంగిళ్లను రంగు రంగుల ముగ్గులతో తీర్చిదిద్దుతారు.

సంక్రాంతి మూడురోజుల పండుగ.

మొదటి రోజు భోగి. భోగి రోజున చలిమంటలు వేసుకుంటారు. తలంటుకుని స్నానము చేస్తారు. కొత్తబట్టలు ధరిస్తారు. సాయంత్రం పిల్లలకు భోగిపళ్లు తలపై నుండి పోస్తారు. కీడు జరుగకూడదని దిష్టి తీస్తారు. కొందరు స్త్రీలు గొబ్బి పూజ చేస్తారు. గొబ్బి అనగా గౌరీదేవి అని భావన. సంక్రాంతికి కూడా బొమ్మలకొలువు పెట్టు ఆచారము వుంది.


రెండవరోజు సంక్రాంతి. ఇది ముఖ్యమైన పండుగ. భగవంతునికి పూజలు, దానధర్మాలు చేస్తారు.

పితృదేవతలకు తర్పణము ఇచ్చి బంగారంతో గుమ్మడికాయ దానము చేసేవారు.

యజమానులు తమ పొలాలలో, ఇండ్లలో పని చేసేవారికి ధాన్యము, కొత్తబట్టలు ఇస్తారు. పెద్దలకు నమస్కరించి చిన్నలు ఆశీస్సులు పొందుతారు.

మూడవరోజు కనుము పండుగ. ఇది పశువుల పండుగ రైతులకు, పనివారికి ముఖ్యమైన పండుగ. ఏడాది కష్టానికి ప్రతిఫలం లభించే రోజు. పశువులను కడిగి అలంకరిస్తారు. పశువులశాలలో పొంగలి వండు తారు. దానిలో పసుపు కుంకుమలు కలిపి నైవేద్యం పెడతారు. దానిని పొలాలలో చల్లుతారు. 'పొలిచల్లుట' అంటే అదే.

సంక్రాంతిరోజులలో గంగిరెద్దులవారు, హరి దాసులు, జంగమదేవరలు సంచారాలు చేస్తారు. ముగ్గులతో వీధులు, ఇళ్ల ముంగిళ్లు అందంగా



వుంటాయి. కొత్త అల్లుళ్లు, కూతుళ్లు, కొడుకులు,

కోడళ్లు, మనుమలు అందరితో కుటుంబాలు కళకళ లాడుతాయి. కనుము తరువాత 'ముక్కనుము' రోజుననే - వచ్చిన బంధుమిత్రులు తిరిగి వెడు తుంటారు. పెద్దలను స్మరించుకునే రోజులు కూడా సంక్రాంతిరోజులు. బీదాబిక్కీ నుండి, గొప్పవారి వరకు అందరూ అనువుగల పండుగగా సంక్రాంతిని జరుపు కుంటారు.

## మహాశివరాత్రి

మాఘ బహుళ చతుర్దశి శివరాత్రి పండుగ. సాధారణంగా శివరాత్రి ఫిబ్రవరి, మార్చి నెలలలో వస్తూ వుంటుంది. చలి కాలమునకు శివరాత్రి ముగింపు అంటారు. శివరాత్రి లింగోద్భవ సమయము. సృష్టికి ఆది శివరాత్రి అని భావన. అందుకే పండుగ ఆ రోజు ఉదయమున భక్తులు బావులలో, నూతులలో, చెరువు

లలో, నదులలో, సముద్రాలలో ఎక్కడయినా స్నానము చేస్తారు. ఆ రోజు రాత్రి లింగోద్భవ సమయము వరకూ అలా ఉపవాసము వుండి అప్పుడు అభిషేకాలు, పూజలు చేస్తారు. నైవేద్యము సమర్పించి ప్రసాదము స్వీకరిస్తారు. శివరాత్రి అంతా జాగరణము చేస్తారు. ఆ రోజు చేసే మంచి పని ఏదయినా ఎంతో పుణ్యము కలుగచేస్తుందని నమ్మకము.

అక్షరాభ్యాసము అనగా పిల్లలు చదువును ప్రారంభించుట ఓం నమశ్శివాయ అను పంచాక్షరము లతో మొదలు అగుట వాడుకగా వుండేది.

శివుడు భక్త సులభుడు, భోళాశంకరుడు అని చెబుతారు. అతని నివాసము కైలాసము, వాహనము నంది. ఆయుధము త్రిశూలము. అతను ఏనుగు చర్మము ధరించి, భిక్షాపాత్ర పట్టుకొని, విభూతి

పూసుకొని, శ్మశానములలో ఆదిభిక్షువుగా తిరుగుతూ ఉంటాడు అంటారు. పార్వతి శివుని భార్య. మరొక భార్య గంగ. కుమారస్వామి, వినాయకుడు శివుని సంతానము. శివుని తలపై జటాజూటములో చంద్రుడు ఉంటాడు. నాట్యమునకు శ్రీకారము చుట్టిన నటరాజు గా కూడా అతను కీర్తింపబడతాడు. సముద్రమును దేవతలు, రాక్షసులు చిలికినపుడు విషము పుట్టింది. ఆ విషముచే లోకములు నాశనము కాకుండా తన కంఠమున పట్టినవాడు శివుడు.

బోయవాడయిన తిన్నడికి, జూదరి అయిన గుణనిధికి తెలియక చేసిన పనులకే మెచ్చి ముక్తిని ఇచ్చినవాడు శివుడు. శివభక్తుల కథలు ఎన్నో.

శివరాత్రినాడు పరమశివుని క్షేత్రాలలో పర్వదిన వేడుకలు జరుగుతాయి. కాశీ, శ్రీశైలం, రామేశ్వరం



వంటివి అన్నీ శివుని క్షేత్రములే. శివాలయము లేని ఊరు వుండదని సామెత. తెలుగు దేశమునకు త్రిలింగ దేశమని మరియొక పేరు కలదు. శ్రీశైలము,

ద్రాక్షారామము, శ్రీ కాళహస్తి అను త్రిలింగక్షేత్రాల నడుమ ప్రదేశమే త్రిలింగము. అనగా తెలుగు ప్రాంతము. శ్రీశైల శిఖరమును చూసిన వారికి పునర్జన్మ ఉండదని నానుడి. పన్నెండు జ్యోతిర్లింగ ములుగా పరమశివుడు వివిధ క్షేత్రాలలో పూజింప బడు తున్నాడు. ఉదయము, సాయంకాలము భక్తితో ఎవరు ద్వాదశ అనగా పన్నెండు క్షేత్రాములలోని జ్యోతిర్లింగములను స్మరించెదరో వారికి మోక్షము లభించునని చెబుతారు.

## "నిరంతర విద్యా కేంద్రములకు" ఉపయోగపడు మా ప్రచురణలు

- స్వామి వివేకానంద
- అమరజీవి
- కందుకూరి వీరేశలింగం
- ఈసఫ్ నీతి కథలు
- నవ్వుకుందాం
- జానపద కళలు
- అన్నమాచార్యులు
- బాల కార్మికులు
- నీరు
- పురాణబాలలు
- తెలుగు పండుగలు
- శబ్దకాలుష్యం